మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**హుస్నాబాద్ రూరల్ / కోహెడ, ఆగస్టు 14, ప్రభాతవార్త:** హుస్నాబాద్‌లోని కేరళ హైస్కూల్‌లో గురువారం ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు పుట్టిన రోజు పండుగను హిందువులు ఎభక్తిశ్రద్ధల తో జరుపుకుంటారని అన్నారు.విద్యార్థులు గోపికలు, శ్రీకృష్ణున్ని వేషధారణ లతో నృత్యాలుచేసి అందరినీ అకట్టుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి, కరస్పాండెంట్ అల్లే శైలేందర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కోహెడలో...**

కోహెడ మండలంలోని శ్రీఆదర్శ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు శ్రీకృష్ణున్ని,గోపికల వేషాధారణలతో పాఠశాలలో నృత్యాలు చేసి చూపరులను అకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉట్టికొట్టె సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శైలజ, కరస్పాండెంట్ అంజయ్య,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రూ. 3 వేలు చెల్లించండి.. పాసులు పొందండి

### -తాడ్దాన్‌పల్లి టోల్ మేనేజర్ అనిల్‌కుమార్

**పుల్‌కల్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** జాతీయ రహదారులపై ప్రయాణానికి ఫాస్టాగ్ వార్షిక పాస్ అమలులోకి రానుండటంతో తాడ్దాన్‌పల్లి వద్ద ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తాడ్దాన్‌పల్లి టోల్ ప్లాజా మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. వాహనదారులు రూ.3 వేల చెల్లించి పాసు కొనుగోలు చేస్తే సంవత్సరం పాటు 200 ట్రిప్పులను టోల్ ప్లాజా గుండా తిరిగాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. వాహన చోదకులు పడుతున్న పాట్లను పరిష్కరించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) ప్రత్యేకంగా రాజా మార్గ్ యాత్ర యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. సంగారెడ్డి నుంచి మహారాష్ట్రలోని నాందేడ్, అకోలా వరకు వెళ్లే ఎస్ఎన్ఏ 161 జాతీయ రహదారిపై సైతం యాప్ ద్వార సేవలు పొందవచ్చన్నారు. ఇది వరకే ఫాస్టాగ్ వార్షిక పాస్ పొందిన వారు ఈ నెల15వ తేదీ నుంచి అమలులోకి వస్తుందన్నారు. ఏడాది తర్వాత 3 వేలు చెల్లించి పాస్‌ను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అవకాశాన్ని వాహన దారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

### పంద్రాగస్టు వేడుకలకు

## పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా సీపీ కార్యాలయంలోగల పోలీసు పెరేడ్‌లో ఏర్పాట్లను సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి గురువారం పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే ముఖ్యఅతిథులకు, మీడియాకు, విద్యార్థులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వర్షాన్ని దృష్టి లో పెట్టుకొని ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతీయ సమైక్యత ప్రతిబింబించేలా కార్యక్రమం నిర్వహించాలన్నారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంస పత్రాల ప్రదానం తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్టేజీ డెకరేషన్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి వివిధశాఖల స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమం లో అదనపు డిసిపి సుభాష్‌చంద్రబోస్, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ



భారీ జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

**గజ్వేల్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** జాతీయ భావాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్‌లు పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలో విద్యార్థులతో కలిసి భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ప్రజల్లో జాతీయ భావం పెంపొందించాలన్న ఉద్దేశంతో ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో పట్టణా ల్లో, మండలకేంద్రాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరంగా ర్యాలీలో విద్యార్థులతో పాటు యువకులు, పార్టీలకతీతంగా, కుల, మత, వర్గ బేధం లేకుండా పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు అంగడిపేట హనుమాన్ దేవాలయం నుండి ఇందిరాపార్కు మీదుగా స్వామి వివేకానంద విగ్రహం వరకు జాతీయ జెండాలను చేతబట్టుకొని స్వాతంత్ర సమరయోధులను స్మరించుకుంటూ తిరంగా ర్యాలీ నిర్వహించారు. గజ్వేల్ పట్టణం జాతీయ జెండాలతో కళకళలాడింది. పలు పాఠశాలల విద్యార్థులు, కళాశాలల విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని తిరంగా ర్యాలీని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులతో పాటు స్థానిక బిజెపి నాయకులు ఎల్కంటి సురేష్, బండారు మహేష్, కాశమైన సందీప్, శశిధర్‌రెడ్డి, పంజాల రాజు, అయిల మహేందర్, సుభాష్‌చంద్రబోస్, రామచంద్రాచారి, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా పవన్‌కుమార్

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులుగా సంగారెడ్డి పట్టణానికి చెందిన పురుమళ్ల పవన్ కుమార్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. పవన్‌కుమార్ విద్యార్థి దశ నుంచి ఆర్ఎస్ఎస్, ఏబీవీపి కార్యకర్తగా 2002 నుంచి బిజెపి బూత్ స్థాయి కార్యకర్తగా, 2003 నుంచి 2006 వరకు ప్రధాన కార్యదర్శిగా, 2009 నుంచి 2012 వరకు పట్టణ అధ్యక్షులుగా, 2013నుంచి 2016 వరకు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులుగా, 2016 నుంచి 2019 వరకు బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, 2019 నుంచి 2024వరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షులుగా, 2024-25 బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా సేవలు అందచేస్తూ వచ్చారు. తనపై నమ్మకంతో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా నియామకానికి సహకరించి ఎంపి రఘునందన్‌రావు, ఎమ్మెల్యే చిన్నమైల్ అంజిరెడ్డిలకు పవన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## పొంగిపొర్లుతున్న వనదుర్గ ప్రాజెక్ట్

### దుర్గామాత ఆలయం మూసివేత

### అమ్మవారి ఉత్సవ విగ్రహానికి రాజ గోపురంలో పూజలు

**పాపన్నపేట, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ఏడుపాయల సమీపంలోని వనదుర్గ ప్రాజెక్టు పొంగిపొర్లడంతో వన దుర్గమాత ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాటు సింగూర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడం మూలంగా వనదుర్గా ప్రాజెక్ట్ పొంగిపొర్లుతుంది. దీంతో ఆలయ సమీపానగల వంతెనల వద్ద నీరు పెద్దఎత్తున ప్రవహిస్తూ నిజాంసాగర్ వైపు పరుగులీ దుతుంది. దీంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అమ్మవారి ఆలయాన్ని గురువారం మూసివేశారు, అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేతతో నీరు మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున భక్తులు ఎవరు ఆలయం వైపు వెళ్లొద్దని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సూచించారు. వరద ఉధృతి తగ్గగానే ఆలయాన్ని సంప్రోక్షణ చేసి పున ప్రారంభిస్తామని ఆలయ సిబ్బంది వెల్లడించారు. ఆలయం మూసివేసినందున పూజలు రాజగోపురంలో నిర్వహిస్తున్న విషయం భక్తులు గమనించాలని ఆలయ సిబ్బంది సూచించారు.



వంతెనల వద్ద నీరు పెద్దఎత్తున ప్రవహిస్తున్న దృశ్యం
(ఇన్‌సెట్‌లో దుర్గామాత ఆలయం మూసివేత దృశ్యం)

# అధిక వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

*** ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి * ఎవరికీ సెలవులు మంజూరు లేదు * సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

అధికవర్షాలతో అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ప్రజలకు సూచించారు. గురువారం రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావుతో కలిసి అధిక వర్షాల వల్ల ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికార యంత్రాంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించిన అనంతరం ఆమె జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.రాబోవు రెండు,మూడు రోజులు భారీనుంచి అతి భారీ వర్షాలుపడే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించడానికైనా సిద్దంగా ఉందని జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారని తెలిపారు. వర్షాల నేపథ్యం లో అప్రమత్తంగా ఉంటూ జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులెవరికీ సెలవులు మంజూరు చేయడం లేదని అన్ని స్థాయిల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

జిల్లాలో ఇప్పటికే 29 నీటి వనరులు పూర్తిస్థాయిలో నిండి ఉన్నాయని సడన్‌గా భారీ వర్షం కురిస్తే లోతట్టు ప్రాంతాలలోకి నీరుచేరే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని సూచించారు. పాడుబడిన ఇళ్లల్లో ఉండవద్దని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా ఏదైనా సమస్య వస్తే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబరు 08457-230000 కాల్ చేయాలన్నారు. మండల స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు ఇంటి తాళాలను అందచేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, చైర్మన్లు



ప్రొటోకాల్ పాటించలేదని స్టేజ్ దిగి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### ఎంపి సురేష్ షెట్కార్

**జహీరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:**

ప్రజలకు సంక్షేమ పథకాలు అందిండమే ధ్యేయంగా సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో హోతి(కె)లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం తాళాలను లబ్దిదారులకు ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డిలు అందచేశారు. అనంతరం ఎంపి శెట్కార్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందిస్తోందన్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, పట్టణానికి మరో 2వేల ఇళ్లు మంజూరు చేయనున్నామని చెప్పారు. 660 ఇళ్లకు గాను 524 ఇళ్లను లబ్దిదారులకు అందచేశామని, 134 ఇళ్లపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేసి వారం రోజుల్లో అందచేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మాట్లాడుతూ 660 ఇళ్లను బిఆర్ఎస్ హయాంలో మంజూరు చేసినవారికే అందచేయాలన్నారు. ఫిర్యాదుల సాకుతో పంపిణీ చేయకపోవడం సరికదాన్నారు.

ఈ కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్, ఆర్డిఓ రామ్‌రెడ్డి, తహసీల్దార్ పి దశరథ్, ఆత్మ కమిటి చైర్మన్ పి రామలింగారెడ్డి, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, మున్సిపల్ కమీషనర్‌డి సుభాష్‌రావు, గృహ నిర్మాణ శాఖ డిఈ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

**గందరగోళం మధ్య డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ**

**-ప్రొటోకాల్ పాటించలేదని ఎమ్మెల్యే నిరసన**

**జహీరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హోతి(కె)లో నిర్మించిన 660 డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో గందరగోళం నెలకొంది. లబ్దిదారుల నిరసన మధ్య ఎంపి సురేష్ కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావులు ఇళ్ల తాళాలను పంపిణీ చేశారు. స్టేజి పైకి ఎమ్మెల్యే మాణిక్‌రావును నిర్వాహకులు ఆహ్వానించలేదని ప్రొటోకాల్ పాటించలేదని బిఆర్ఎస్ నాయకులతో పాటు ఎమ్మెల్యే నిరసన వ్యక్తం చేశారు. ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ఆర్డిఓ రాంరెడ్డి, తహసీల్దార్, పోలీసులు ఎమ్మెల్యేకు నచ్చచెప్పి స్టేజి ఎక్కించారు. 880 ఇళ్లకుగాను 524 ఇళ్లను లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో గతంలో ఇళ్లు పొంది సర్టిఫికెట్లు అందుకున్న వారు ఇప్పుడు అందుకోలేకపోతున్న లబ్దిదారులు ఆందోళనకు దిగడంతో సభ గందరగోళంగా మారింది. ఫిర్యాదు నెపంతో గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం సరికాదని లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులమైనందుకు గత ప్రభుత్వం తమకు ఇండ్లను మంజూరు చేసిందని, రద్దుచేయడం సరికాదని, ఇండ్లను అందచేయాలని లబ్దిదారులు ఎంపి, ఎమ్మెల్యే, అధికారులకు బ్రతిమిలాడుకోవడం కానవచ్చింది. కార్యక్రమం గందరగోళం నుంచి తేరుకునేలా డిఎస్పి సైదా నాయక్, సిఐలు శివలింగం, జక్కుల హనుమంతు, ఎస్ఐ వినియ్‌కుమార్, కాశీనాథ్‌లు తమ సిబ్బందితో తగు చర్యలు తీసుకున్నారు.

## రైతులకు యూరియా సరఫరా చేయాలి

**దుబ్బాక(అక్భర్‌పేట భూంపల్లి) ఆగస్టు 14 ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు గడ్డుకాలం ఏర్పడిందని అన్న దాతలు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడు తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని రైతులు తెలిపారు. దుబ్బాక మండలం హబ్సీపూర్ చౌరస్తా వద్ద రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న యూరియా పంపిణీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడంతో గ్రామాల్లో తిరుగలేక పోతున్నామని కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయా లని డిమాండ్ చేశారు. అన్నదాతలకు ఇబ్బందులు కలగకుండా కేంద్ర ప్రభు త్వం ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాల్లో యూరియా పంపిణీ చేపట్టాలన్నారు. రైతులు సుమారు గంటపాటు ధర్నా చేయడంతో, విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని యూరియా పంపిణీ అయ్యే విధంగా చూస్తామని పోలీసులు నచ్చజెప్పడంతో అన్నదాతలు ఆందోళన విరమించారు.



హబ్సీపూర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

# నిధులు లేక గ్రామాలు నిర్వీర్యం.. గాడితప్పిన పాలన

**అప్పుల తిప్పలతో పంచాయతీ కార్యదర్శులు.. సంగారెడ్డి జిల్లాలో 620 గ్రామ పంచాయతీలు.. పంచాయతీ ఎన్నికల కోసం ప్రజల ఎదురుచూపులు**

**చౌటకూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త:**

పంచాయతీలు ఎన్నికలకు నోచుకోక నిధుల విడుదలకాక గ్రామాలు నిర్వీర్యంలో కూరుకుపోతున్నాయి. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయితీ కార్యదర్శులకు నిధులు అందక అభివృద్ధి పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. 18 నెలలుగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో గ్రామాల్లో పాలన గాడితప్పిందని చెప్పడం అతిశయోక్తి కాదు. గ్రామాలకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రాక, వసూలైన ఇంటి పన్నులు జీతాల చెల్లింపునకు సైతం సరిపోవడం లేదు.

**మరమ్మతులకు అప్పులు...**

గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని నిత్యం ట్రాక్టర్‌లో తరలించేందుకు అవసరమైన డీజిల్ కొనుగోలుకు డబ్బులు లేక, వీధుల్లో విద్యుత్ దీపాలను వెలిగించేందుకు అవసరమైన మరమ్మతులకు, బల్బులకు, చెడిపోయిన మోటార్లను బాగు చేసేందుకు, పైప్‌లైన్ మరమ్మతులకు, పంచాయతీ కార్మికులకు జీతాలు, నిర్వహణ కోసం గ్రామాల్లోని వ్యాపార సముదాయాల్లో అరువుగా తెచ్చిన సామాన్లకు డబ్బులు చెల్లించలేక, చేసిన పనులకు బిల్లులు రాక తాము పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయిని పంచాయతీ కార్యదర్శులు లబోదిబోమంటున్నారు.





శివంపేటలోని పంచాయతీ కార్యాలయం

**ప్రత్యేక అధికారులు ఎక్కడ...?...**

పంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో లేక పాలన అస్తవ్యస్తంగా మారింది. గ్రామాలకు వెళితే సమస్యలు పరిష్కరించాలని ప్రజలు పరేషాన్ చేస్తారన్న భయంతో అధికారులు గ్రామాలకు మొఖం చాటేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. పంచాయతీల పరిపాలన కోసం నెల నెల మెయింటెనెన్స్ కోసం నిధులను విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.గ్రామాల్లో పారిశుద్యం నిర్వహణ కోసం, మరమ్మతులకు, అత్యవసరమైన పనుల కోసం నిధులను విడుదల చేయాలని కార్యదర్శులు కోరుతున్నారు.

**బిల్లులు చెల్లించాలని వేడుకోలు...**

గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శులు వినతిచేస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు రాక, ఇకముందు చేసేందుకు చేతిలో డబ్బులు లేక ఆర్థిక భారంతో అవస్థలు పడుతున్నామని కార్యదర్శులు లబోదిబోమంటున్నారు. చిన్న గ్రామ పంచాయతీలలో మూడు నుంచి నాలుగు లక్షలు, పెద్ద పంచాయతీలలో 5 నుంచి 10 లక్షల వరకు ఖర్చులుచేసి ఉన్నామని,కొత్తగా పంచాయతీలో అరువు పుట్టే పరిస్థితి లేదని, రుణాలు తెచ్చుకునే స్థాయిలో లేమని పంచాయతీ కార్యదర్శులు మదనపడుతున్నారు.

త్వరగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి,పంచాయతీ కార్యదర్శుల మనోవే దనలు పరిష్కారం అయ్యేలా చూడాలని ఉమ్మడి పుల్‌కల్ మండల ప్రజలు సూచిస్తున్నారు.



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న గజ్వేల్ ఏసిపి నరసింహులు

## గౌరారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసిన గజ్వేల్ ఎసిపి

**వర్గల్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** వార్షిక తనిఖీల్లో భాగంగా గౌరారం పోలీస్‌స్టేషన్‌ను గురువారం గజ్వేల్ ఏసిపి నరసింహులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన, స్వాధీనం చేసుకున్న వాహనాలను, స్టేషన్ రికార్డ్స్, సిడి ఫైల్స్, సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో సిబ్బంది వర్టికల్‌వారీగా ఎవరెవరు ఏ విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏసిపి నరసింహులు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ప్రజల ధన, మాన ప్రాణ రక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడి వారిసమస్యలు పరిష్కరించాలని సూచించారు. సీజ్ చేసిన వాహనాలను సంబంధిత వాహన యజమానులకు సాధ్యమైనంత త్వరగా అందజేయాలని చెప్పారు. విపిఓ వ్యవస్థను మెరుగుపరచాలని వారంలో రెండు మూడుసార్లు గ్రామాలను సందర్శించాలని సిబ్బందికి, అధికారులకు సూచించారు. కేడీలు, డీసీలు, సస్పెక్ట్‌లు, రౌడీలపై మరింత నిఘా ఉంచాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని, ఎన్ఫోర్స్‌మెంట్ వర్క్ ప్రతిరోజు నిర్వహించాలన్నారు. ఇసుక, పిడిఎస్ రైస్, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాలను సందర్శించినప్పుడు ప్రజలకు, యువతీ, యువకులకు గంజాయి ఇతర మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విధినిర్వహణ ఎంత ముఖ్యమో ఆరోగ్యం అంతే ముఖ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వహించాలని తెలిపారు. మోటార్ సైకిల్ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. వర్షాకాలం అయినందున తప్పకుండా జర్కిన్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, ఏఎస్ఐలు పోచాగౌడ్, రుక్కమ్మ, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వం కృషి

### -యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి

**మర్కుక్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి తెలిపారు. గురువారం దామరకుంట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సౌండ్‌బాక్స్ సిస్టమ్, ప్రాథమిక పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ ఫిల్టర్‌ను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం దాతలతోపాటు ఆంక్షరెడ్డిని శాలువాలతో సత్కరిం చారు. అనంతరం ఆంక్షరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనతో పాటు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉచిత నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, రెండు జతల దుస్తులు విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరాములు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్, వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పత్తి నర్సింలు, ర్యాకం యాదగిరి, నాయకులు శ్యాంసుందర్‌గౌడ్, రవి, ఉపాధ్యాయురాలు రజిత, శ్రీనివాస్, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

### జెండా పనులు నిర్వర్తిస్తుండగా అపశృతి

## విద్యుత్ షాక్ తగిలి పారిశుధ్య కార్మికుడి మృతి

**చేర్యాల, ఆగస్టు 14,ప్రభాతవార్త :** పంద్రాగస్టు జెండా పనులు నిర్వహిస్తున్న క్రమంలో గ్రామ పంచాయతి సిబ్బంది విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన వేచరేణి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని వేచరేణి గ్రామానికి చెందిన ఎం.డి.మోహిన్ పాషా(33) పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అయితే నేడు(శుక్రవారం) నిర్వహించే జెండా కార్యక్రమానికి సంబంధించి పంచాయతి కార్యాలయంలో పనులు నిర్వర్తిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి పాషా అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు ,ఒక కుమారుడు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**పాపన్నపేట, ఆగస్టు 14, ప్రభాతవార్త :** బోరు బావి స్టాటర్ మరమ్మతులు చేపడుతూ విద్యుత్ సరఫరా అయి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కందిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కందిపల్లి గ్రామానికి చెందిన టెక్మాల్ విఠల్ (42) కూలి పనులతో పాటు బోరుబావి స్టాటర్‌ల మరమ్మతులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ దారుని బోరుబావి నడవక పోవడంతో విఠల్ మరమ్మతులు చేసేందుకు వెళ్ళగా స్టాటర్ పనిచేయక పోవడంతో మరమ్మతులు చేపడుతుండగా విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదవశాత్తూ షాక్ తగిలి అపస్మారక స్థితిలో కి వెళ్లడంతో ఈ విషయం గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి క్షత గాత్రాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. కాగా మృతుడికి భార్య దుర్గమ్మ, ఒక కుమారుడు ఉన్నారు. ఈ విషయమై పాపన్న పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**న్యాల్‌కల్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని హద్నూర్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం... వాహనాలు తనిఖీ చేస్తున్న తరుణంలో అటుగా వచ్చిన టవేరా (ఎంహెచ్ 18క్యూ 8888)ను ఆపి తనిఖీ చేయగా పలు బస్తాల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని పోలీసు ఠాణాకు తరలించి వాహన డ్రైవర్ కర్ణాటకలోని బీదర్ జిల్లాకు చెందిన సునీల్‌కుమార్‌పై కేసు నమోదు చేసి రేషన్ బియ్యంను దిగ్వాల్‌లోని ఎంఎంసి కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి తక్కువ ధరకు రేషన్‌బియ్యం కొనుగోలు చేసి కర్నాటకలో అధిక ధరలకు రేషన్ బియ్యం అమ్ముకుంటున్నట్లు డ్రైవర్ సునీల్‌కుమార్ పేర్కొనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ దోమ సుజిత్ హెచ్చరించారు.



రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనం దృశ్యం

# నేడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## -రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు రాక

## -కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ మనుచౌదరి, పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, తదితరుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 14, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించటానికి జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఉదయం 9.30గంటలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.కేశవరావు విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు గౌరవవందనాన్ని స్వీకరించనున్నారు. ఆ తరువాత జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల,సంక్షేమ పథకాల ప్రగతిపై సందేశం ఆయన ఇవ్వనున్నారు. ఈ విషయంపై గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ మనుచౌదరి సందర్శించి పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు వర్షాలతో తలెత్తకుండ ముందస్తుగ వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేశారు. వివిధ స్టాల్స్‌ను కూడ ఏర్పాటు చేశారు. ఆయనతో పాటు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, కలెక్టరేట్ ఎఒ రాంమోహన్, డిఎస్ఒ శ్రీనివాస్‌రెడ్డి, డిఇఒ విజయకుమారి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టరేట్ వద్ద ఉదయం 9.10గంటల నుంచి 11.25గంటల వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు సిద్ధం చేసిన దృశ్యం

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

## -పాఠశాలకు ఎల్ఈడి టివి అందించిన కార్పొరేటర్

**అత్తాపూర్ ఆగస్టు14,ప్రభాతవార్త :** విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ పేర్కొన్నారు.గురువారం స్కూల్లో పిల్లలకు సాంకేతిక విద్య గురించి టీవీ లేదని హెడ్మాస్టర్ అభ్యర్థన మేరకు రాజేంద్రనగర్ డివిజన్ ఎర్రబోడ ప్రైమరీ స్కూల్ విద్యార్థిని విద్యార్థుల సౌకర్యార్థం కోసం రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ దంపతులు స్వయంగా స్మార్ట్ ఎల్ఈడి టీవీ, సౌండ్ సిస్టంను అందజేసి ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ...స్కూల్ కు ఎల్ఈడీ టివి, సౌండ్ సిస్టంను డొనేట్ చేసినందుకు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ అర్చన జయ ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థులను చేర్పించి చదివించాలని అదేవిధంగా దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలో మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. విద్య పరంగా విద్యార్థిని విద్యార్థులకు మా వంతు సహకారం చేయటానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి గారు, జీవన్దాస్, సూర్య ప్రకాష్ రెడ్డి,రాజేష్, గిరిబాబు, ప్రేమ్ రాజ్, రాహుల్, రాము చారి తదితరులు పాల్గొన్నారు.



# దంచికొట్టిన వాన..



ముత్తడి దాటి ప్రవహిస్తున్న కోటపల్లి ప్రాజెక్టు

- -పొంగిపొర్లిన వాగులు..వంకలు..
- -పలు గ్రామాల రాకపోకలు బంద్..
- -ముత్తడి దాటి ప్రవహిస్తున్న చెరువులు
- -జలమయమైన పంట పొలాలు..

**వికారాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త ః**

రెండు రోజులుగా మొదలైన జడివాన గత రాత్రి మరింత ఊపందుకుంది. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో నియోజకవర్గ పరిధిలో ఉన్న చెరువులు,కుంటలు నిండుకుని ముత్తడి దాటి ప్రవహించాయి. వాగులు వంకలు పొంగి పొర్లడంతో రహదారులు సైతం జలమయమయ్యాయి. ముఖ్యంగా బ్రిడ్జీల వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్థంభించాయి. వాహనాల రాకపోకలు సాగకపోవడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వికారాబాద్ నియోజకవర్గంలోని కోటపల్లి ప్రాజెక్టుకు వరద నీరు భారీగా వచ్చి చేరడంతో నిండు కుండలా మారి ముత్తడి దాటి ప్రవహించింది. అలుగు దాటి ప్రవహించడంతో నాగసముందర్-ధారూరు మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ధారూరు మండలం గురుదొట్ల చెరువుకు గండి పడటంతో ఆయకట్టు రైతుల పొలాల్లో చెరువు నీరు ప్రవాహం ఉధృతంగా ప్రవహించి పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గోధంగూడ బ్రిడ్జీ పనులు కొనసాగుతుండటంతో అప్రోచ్ రోడ్డులో లారీ బురదలో ఇరుక్కుపోవడంతో అటు వైపుగా రాకపోకలు నిలిచిపోయాయి. గోధంగూడ రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద వరద నీరు అధికంగా ప్రవహించడంతో ధ్యాచారం, మోమిన్‌కలాన్ వెళ్ళేందుకు రాకపోకలు స్థంభించాయి. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివసాగర్ చెరువు, మండల పరిధిలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టు, మర్పల్లి మండలం కొంశట్‌పల్లి ప్రాజెక్టు ముత్తడి దాటి ప్రవహించాయి. వికారాబాద్ నియోజకవర్గంలో అత్యధిక వర్షపాతం ధారూరు మండలంలో నమోదు కాగా, అత్యల్పంగా బంట్వారం మండలంలో నమోదైంది. ధారూరు మండలంలో 97.5 మి.మి నమోదు కాగా, వికారాబాద్ మండలంలో 79.7 మి.మి, కోటపల్లి మండలంలో 36.3 మి.మి, మర్పల్లి మండలంలో 32.8 మి.మి, మోమిన్‌పేట్ మండలంలో 29.8, బంట్వారం మండ లంలో 16.1 మి.మి వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



గురుదొట్ల చెరువుకు గండిపడిన దృశ్యం



గోదంగూడ వద్ద లారీ దిగబడటంతో స్థంభించిన రాకపోకలు

# మరో మూడు రోజులు వానలతో జాగ్రత్త..

## -మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 14, ప్రభాతవార్త ః**



వీడియో కాన్ఫరెన్సును వీక్షిస్తున్న జిల్లా అధికారులు

రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమీషనర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావుతో కలసి గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే మూడు రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గడచిన 24 గంటల్లో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్ల ను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 24 గంటల్లో రెడ్ అలెర్ట్‌గా ఉన్న మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలలో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ల ను అప్రమత్తం చేశారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గా ను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారుల ను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవుల ు రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ల ను ఆదేశించారు.లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు.రైల్వే లై న్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వే లు,లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకో వాలని అన్నారు. ముఖ్యంగా లోలెవెల్ బ్రిడ్జీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించా రు. అంటువ్యాధులు ప్రబలకుండా, త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పి నారాయణ రెడ్డి, కోడంగల్ నుండి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయని, ఎక్కడ ఎలాంటి సమస్య జరుగలేదని, పరిగి, కోడం గల్ ,వికారాబాద్, తాండూర్ నియోజక వర్గంలో లోత్తట్టు ప్రాంతాలలో పట్టిష్ట చర్యలు చేపడు తున్నట్లు, అనంతగిరి ప్రాంతాన్ని మూసివేస్తున్నట్లు, బోటింగ్, ట్రెక్కింగ్ ఉండదని, పర్యాటకులు ఎవ్వరు కూడా అనంతగిరికి రాకుడదని సూచించామని మంత్రులు, సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, అయినప్పటికీ రా నున్న 48 గంటల పాటు భారీ వర్ష సూచన దృష్ట్యా అన్ని శాఖల అధికారుల ను అప్రమత్తం చేశామని వివరించారు. ఎలాంటి పరిస్థితి తలెత్తిన సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సన్నద్ధమై ఉన్నారని తెలిపారు. ఇప్పటికే అధికారులు, సిబ్బంది సెలవుల ు రద్దు చేశామని, జిల్లా నుండి వీడియో కాన్ఫరె న్సు లో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్,సుదీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఆర్ఓ మంగీ లాల్, ఆర్డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పొంగి పొర్లిన వాగులు, వంకలు

## - నీటిలో మునిగిన జీవన్గీ మహాదేవుని ఆలయం

## - నిండా ప్రవహించిన కాగ్నా..

**తాండూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త :**



వరద నీటితో మునిగి పోయిన జీవన్గీ మహాదేవుని ఆలయం.

వికారాబాద్ జిల్లా తాండూరులో వరుణుడు విశ్వరూపం చూపించాడు. బుధ, గురువారం కురిసిన భారీ వర్షానికి కాగ్నా నదితో పాటు నియోజకవర్గంలోని వాగులు, ప్రాజెక్టులు ఉప్పొంగా ప్రవహించాయి. వాగులు, వంకలు ఉప్పొంగా ప్రవహించడంతో పలు గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. పలు గ్రామాలలో పంట పొలాలు నీట మునిగిపోయాయి. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. తాండూరు- కోడంగల్ రోడ్డు మార్గంలోని కాగ్నా నదికి వరదనీరు పోటెత్తింది. నదిపై ఉన్న పాత వంతెన పూర్తిగా నీట మునిగిపోయింది. కొత్త వంతెనకు ఆనుకునేంతలా వరదనీరు ప్రవహించింది. తాండూరు మండలంలో భారీ వర్షాల కారణంగా పలు గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. మండలంలని బొకూరు, బిజ్వార్ గ్రామాల మధ్యలోని కాగ్నా నది ఉధృతంగా ప్రవహించడంతో రెండు గ్రామాల మద్య రాకపోకలు నిలిచిపోయాయి. వీర్శెట్టిపల్లి గ్రామం చుట్టూ కాగ్నా నది నీరు ప్రవహించడంతో చిన్నపాటి దీవిలా మారిపోయింది. అదేవిదంగా మండలంలోని అల్లాపూర్, ఐనెల్లి, మల్కాపూర్, సంగెంకలాన్, బెల్కటూరు తదితర గ్రామాలలో వాగులు పొంగిపొర్లడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడి గ్రామాల ప్రజలు అక్కడే ఉండిపోయారు. మరోవైపు యాలాల మండలంలో భారీ వర్షాల ప్రబావం కనిపించింది. మండలంలోని జుంటుపల్లి వాగు ప్రాజెక్టు అలుగు పారింది. భారీ వరద నీరు చేరడంతో ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. బషీరాబాద్ మండలంలో కూడా భారీ వర్షాలు కురిశాయి. ఈ భారీ వర్షానికి జీవన్గీ వాగు ఉధృతంగా ప్రవహించింది. మహాదేవుని ఆలయం వరద నీటితో మునిగిపోయింది. గ్రామంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. నియోజకవర్గంలో భారీ వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందలు పడ్డారు.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీ



.లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో బిజెపి నాయకులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 14, ప్రభాతవార్త**

శామీర్‌పేట మండలం లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని విద్యార్థులతో కలిసి బిజెపి నాయకులు నిర్వహించారు. శామీర్‌పేట మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్‌లో మండల బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ సూచనలతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో లాల్‌గడిమలక్‌పేట్‌లోని సరస్వతి స్కూల్ విద్యార్థులు, యువకులు, బిజెపి నాయకులు,కార్యకర్తలు ర్యాలీలో పాల్గొనటం జరిగిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం మహాగొప్పదన్నారు. త్రివర్ణపతాక గౌరవాన్ని పెంపొందించటం కోసం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటా తిరంగా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని మండల బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణ ముదిరాజ్ సూచించారు. లాల్‌గడిమలక్‌పేట్‌లోని వివిధ వార్డులలో జాతీయ పతాకాలతో హర్ ఘర్ తిరంగా జెండా నినాదాలు చేస్తూ జైజవాన్, జైకిసాన్ అంటూ ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకాన్ని పట్టిన వారు ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణమూదిరాజ్‌తో పాటు గ్రామ మాజీ సర్పంచు బి.వెంకటేశ, మాజీ ఉపసర్పంచు మాలతిమాదవరెడ్డి, యువమోర్చ అధ్యక్షులు శరత్‌కుమార్, మాజీ ఎంపిటిసి ఎ.ఇందిరారాజిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు నేరేడు అశోక్ కుమార్, మల్యాల మహేశ్, కిసాన్‌మోర్చ జిల్లా సభ్యులు, మండల బిజెపి జనరల్ సెక్రటరీ రాయి శ్రీకాంత్‌రెడ్డి, తుంకి భాస్కర్, వంగ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, పాకమల్లేశ్, కిరణ్‌రెడ్డి, బూత్ అద్యక్షులు తేజకాంత్, సిహెచ్ రాజేశ్, మండల నాయకులు శ్రీనివాస్, కార్తీక్‌ముదిరాజ్, నాయకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశభక్తిని చాటిచెప్పాలి : బిజెపి



**అత్తాపూర్ ఆగస్టు14,ప్రభాతవార్త :** జాతియ పతకాలను ఎగరవేసి దేశభక్తిని చాటిచెప్పాలని పలువురు బిజెపి నేతలు పేర్కొన్నారు. గురువారం బిజెపి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీని శివరాంపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ప్రతి ఒక్కరూ మహానీయులను ఆదర్శంగా తీసుకొని ముందకు నడవాలని సూచించారు.ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలని వారి ఇంటి మిద జాతియ పతకాలను ఎగరవేయాలని పిలపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా యాత్ర కన్వీనర్ హరి కిషన్ , బాబూరావు,సోల్జర్ రెడ్డి, వనిత రెడ్డి,జనరల్ సెక్రటరి శ్రీ రాజశేఖర్ రెడ్డి,రాహుల్ రెడ్డి ,మల్లేష్ చారి, రజినికాంత్,తిరుమలేష్, వెంకటేష్,శ్రీనివాస్ రెడ్డి,సరిత రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి,సన్నీ రెడ్డి, పద్మావతి,రాకేష్ గౌడ్,అంబిక, యాదయ్య, రమాకాంత్,గణేష్, ప్రకాష్ రెడ్డి,సుధాకర రెడ్డి, రాజు నాయక్ మరియు నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికలొస్తున్నాయి..

# ఆశలు పెంచుతున్నాయ్..

- సర్పంచ్ పదవుల కోసం నాయకుల పరుగులు
- సొంత నిధులతో గ్రామాలలో అభివృద్ధి పనులు
- ప్రజల మెప్పు పొందేందుకు ప్రయత్నాలు
- ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా రావచ్చు

**షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 14,ప్రభాతవార్త :**

స్థానిక సంస్థల ఎన్నికలు అంటేనే క్షేత్రస్థాయి నుంచి సందడి కనిపిస్తుటుంది... అలాంటి ఎన్నికలకు శంఖారావం పూరించనున్నట్లు ప్రభుత్వం సాంకేతాలు ఇస్తుండటంతో గ్రామీణ ప్రాంతాలలో సందడే సందడి కనిపిస్తుంది... ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న నాయకులు ప్రజల మెప్పు పొందేందుకు కొత్త మార్గాలు వెతుకున్నారు. సొంత నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, విద్యుత్ మరమ్మతు పనులు, బోర్లు వేయించడం, సీసీ కెమెరాలు బిగించడం వంటి వివిధ కార్యక్రమాల ద్వారా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. సొంత నిధులు ఖర్చు చేసి గ్రామాలలో అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఒక్కసారి గ్రామీణ ప్రాంతాలలో కనిపిస్తున్న ఈ ఎన్నికల పండగను పరిశీలిస్తే...

**సందడే సందడి...**

షాద్‌నగర్ నియోజకవర్గంలో 157 గ్రామపంచాయతీలలో స్థానిక సంస్థల ఎన్నికల పిలుపు వస్తుండటంతో సర్పంచి పదవులుపై ఆశలు పెట్టుకున్న నాయకులు హడావిడి చేయడం మొదలుపెట్టారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి ఒక్కో పంచాయతీకి ముగ్గురు నలుగురు చొప్పున పోటీ పడటానికి సిద్ధంగా ఉన్నారు. ఇక బీజేపీ నుంచి సహితం పోటీ చేయడానికి కొన్ని గ్రామాల్లో సిద్ధమవుతున్నారు. అదేవిధంగా స్వతంత్ర్య అభ్యర్థుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉండేటట్లు కనిపిస్తుంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నాయకులు తమ తమ పరిధిలో ఒకవైపు నాయకుల ద్వారా ప్రయత్నాలు కొనసాగిస్తూనే మరోవైపు గ్రామాలలో చురుకుగా గెలుపు వ్యూహాలు రచించుకుంటున్నారు. ఎన్నికల ప్రకటన ఇంకా రాకపోయినా ముందస్తుగానే తమ పునాదిని గట్టిగా మలుచుకుంటున్నారు. ఒకవేళ పార్టీల నుంచి అవకాశం రాకుంటే స్వతంత్రంగానైనా పోటీ చేసే ఆలోచనలో కనిపిస్తున్నారు.ఇదే రీతిలో ఎంపీటీసీల స్థానాలకు కూడా పోటీ కనిపిస్తుంది. మండల కేంద్రాలు, పురపాలికల పరిధిలో ఎంపీటీసీలు, జడ్పీటీసీల స్థానాల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.




ప్రజల్లోకి... ప్రగతి తోటి...

సాధారణంగా ఓటు అడిగితే ప్రజల్లో నమ్మకం ఉండదు... అందుకే ప్రగతి కార్యక్రమాలు స్వచ్ఛందంగా చేపట్టి ప్రజల్లో గుర్తింపు తెచ్చుకొని తద్వారా అవకాశం కోసం ప్రయత్నించాలని అభ్యర్థులు భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ నుంచి సింబల్ రాకపోయినా పార్టీ మద్దతు ఉంటే స్థానిక నేతల ద్వారా గెలుపు సులువు అవుతుందని భావిస్తున్నారు... అందుకే పలు గ్రామాలలో ఇప్పటికే లైన్లో ఉన్న అభ్యర్థులు సీసీ రోడ్లు వేయించడం, కాలువల నిర్మాణాలు చేపట్టాడం, బోరుమోటార్లు వేయించడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలతో ప్రజల మధ్యకు వెళుతున్నారు. ఇది కాకుండా ప్రస్తుతం గణేష్ చదవి వస్తుండటంతో యువజనులను ఏకం చేసి వినాయకులను ఏర్పాటు చేయడం, లేదా వినాయకుడి ఏర్పాటు కోసం భారీగా విరాళాలు ఇవ్వడం వంటివి జోరు అందుకుంటున్నాయి. ఈ క్రమంలో గతంలో కన్నా అధికంగా గల్లీ గల్లీలో వినాయక విగ్రహాలు వెలుస్తున్నాయి. వినాయకుడిని సేవించడం ద్వారా తమ విఘ్నాలు తొలగి అవకాశం వస్తుందని, విజయం సిద్దిస్తుందని ఆయా నాయకులు నమ్ముతున్నారు. ఇలా ఎన్నికలకు అవకాశం పొందేందుకు కావలసిన సామవేద దండోపాయాలన్నింటిని ఉపయోగించుకొని ముందుకు సాగుతున్నారు నాయకులు. దీనితో గ్రామీణ ప్రాంతాలలో పెద్ద ఎత్తున సందడి కనిపిస్తుంది. ఎన్నికల ప్రకటనకు ముందే ఎన్నికల వాతావరణం నెలకొంది. ప్రతి చోట ఎన్నికల అంశమే చర్చనీయాంశంగా మారడం గమనార్హం.

# వాగులు, వంతెనలు ఎప్పటికప్పుడు పరవేక్షించాలి

## -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పి నారాయణరెడ్డి

**ధారూరు, ఆగష్టు 14, ప్రభాతవార్త:** భారీ వర్షాలు కురుస్తున్నందున నీటి ప్రాజెక్టులు, వంతెనలు వాగులు ఎప్పటికప్పుడు పరవేక్షిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ కే.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ధారూర్ మండల పరిధిలోని కోటపల్లి ప్రాజెక్టు గురువారం ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు రోజులపాటు భారీ వర్షాలకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజల ు అప్రమత్తం చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల అత్యవసరం అ ను కుంటే తప్ప బయటికి రాకూడదని చెప్పారు. వరదలు వచ్చు ప్రాం తంలో ఎలాంటి నష్టాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టా లని అధికారులకు సూచించారు. కలెక్టర్ తో పాటు వికారాబాద్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ ఈ ఈ, తాసిల్దార్ సాజిద బేగం, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీరింగ్ భాస్కర్ గౌడ్, డిప్యూటీ తాసిల్దార్ విజయేందర్, ఎస్సై సున్నం రాఘవేందర్, కోటిపల్లి ఎస్ఐ శైలజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోటపల్లి ప్రాజెక్టు నీటి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ర్యాలీ నిర్వహిస్తున్న జేపిసి, అఖిలపక్షాల నాయకులు

### చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ

## జెంసి, అఖిలపక్షాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**చేర్యాల, ఆగస్టు 14, ప్రభాతవార్త :** చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ జేపిసి, అఖిలపక్షాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గురువారం జేపిసి చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు ఆధ్వర ంలో అఖిలపక్షాల నాయకులతో కలిసి ముస్త్యాల, వీరన్నపేట, చుంచునకోట, కడవేరుగు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపురి, శభాష్‌గూడెం గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, బిజెపి, సిపియం, టిటిడిపి, టియంఆర్‌పిఎస్‌తో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సరదాకు బైక్ నడిపి ప్రమాదాలకు గురికావద్దు : సిఐ



మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ మురళి

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** సరదాకోసం మోటార్ సైకిల్ నడిపి ప్రమాదాలకు గురికావద్దని ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు. గురువారం ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మురళి విద్యార్థులకు షీటీమ్ ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, ఈవిటీజింగ్, గుడ్‌టచ్, బాడ్‌టచ్, సోషల్ మీడియా పరిణామాలు, మైనర్ డ్రైవింగ్, డయల్ 100, సమాజంలో జరుగుతున్న నేరాలు నుండి ఎలా రక్షణ పొందాలి, మహిళలు, పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు తదితర వాటి గురించి వివరించారు. విద్యార్థినిలను ఎవరైనా వేధించినా వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట షీటీమ్ నెం.8712667434, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్‌స్టేషన్ సిద్దిపేట 8712 667435 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు మహేష్, రామచంద్రారెడ్డి, ప్రమీద్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నియంత్రణకు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



బస్టాండ్‌లో జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**పెద్దశంకరంపేట, ఆగస్టు 14, ప్రభాతవార్త :** గంజాయి నియంత్రణకు గురువారం పట్టణంలో పోలీసులు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ లతో తనిఖీలు నిర్వహించారు. బస్టాండు. ఆర్టీసీ బస్సులు, పలు దుకాణాలు, ప్రయాణికుల వద్ద బ్యాగులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ నిభందనలకు విరుద్ధంగా మాదకద్రవ్యాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలకు హామీ చేసే గంజాయి లాంటి మత్తు పదార్థాలను నిర్మూలించడంలో ప్రజలు, యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గంజాయి. డ్రగ్స్ రవాణా, అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది బిక్షపతి. సిద్దు. షౌకత్‌అలీ. రమేష్కుమార్, ఆకాష్ పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

**పెద్దశంకరంపేట, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ అన్నారు.గురువారం సాయంత్రం పెద్దశంకరంపేటలోని పీహెచ్సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్, ఫార్మసీని, సిబ్బంది హాజరును ఆయన పరిశీలించారు. గర్భిణీలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించి రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, విధులకు గైర్హాజరు కావద్దని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఓ హరిప్రసాద్, ఎల్టీ పౌల్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ విద్యాధరి క్షేత్రంలో కల్వ సుజాత ప్రత్యేక పూజలు

**వర్గల్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** శ్రీవిద్యాధరి క్షేత్రంలో గురువారం రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికి శేష వస్త్రంతో సత్కరించి అమ్మవారి తీర్ధ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుల తల్లి శ్రీవిద్యాసరస్వతి అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని, తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతృప్తి కలిగించగా, క్షేత్ర అభివృద్ధికి శ్రమిస్తున్న సిద్ధాంతి చంద్రశేఖరశర్మ నేతృత్వంలో ఆలయం మరింత దినదినాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతను ఆశీర్వదిస్తున్న అర్చకులు

# ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించడం సంతోషంగా ఉంది

### మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా ఇంజనీరింగ్ కాలేజీ ప్రారంభించడం సంతోషంగా ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరంలో చేరుతున్న విద్యార్థులకు మంత్రి ఫోన్ ద్వారా గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ హుస్నాబాద్ కరీంనగర్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట నాలుగుజిల్లాలకు మధ్య లో ఉంటుందన్నారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో 5 కోర్సులతో తరగతులు ప్రారంభించామని తెలిపారు. మొదటి బ్యాచ్ మీదే.. మీరే కళాశాల అంబాసిడర్లు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అందించడానికి మీదే మొదటి బ్యాచ్ అన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంత పిల్లలకు సాంకేతిక విద్యను అందించడానికి శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల తీసుకొచ్చానని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సకల సౌకర్యాలు కల్పించి ఎల్లప్పుడు అందుబాటులో ఉండి పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. కళాశాల భవన నిర్మాణానికి 35 ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని త్వరలో సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకోవడానికి ప్రాధాన్యత కల్పించడంతోపాటు నాలుగు జిల్లాలకు అందుబాటులో ఉంటుందని మంచి హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మొదటి సంవత్సరం లో చేరుతున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ హైమావతి, వీసీ ఉమేష్‌కుమార్ ఇతర అధికారులు స్వాగతంపలికి మాట్లాడారు. కాగా హుస్నాబాద్‌లో మొదటిసారి ఇంజనీరింగ్ కాలేజీ తరగతులు ప్రారంభించడంపట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కెడెం లింగమూర్తి, శాతవాహన యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఉమేష్‌కుమార్, యూనివర్శిటీ రిజిస్టర్ రవికుమార్, ఎఎంసి చైర్మన్ తిరుపతిరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీఓ రామ్మూర్తి, ఎసిపి సదా నందం అధికారులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

# నరేంద్రమోడి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

### -మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

**గజ్వేల్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** ఓటు చోరీ విషయంలో నరేంద్రమోడి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి కేంద్ర ఎలక్షన్ కమీషన్‌పై చర్యలు తీసుకోవాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్‌లు డిమాండ్ చేశారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆదేశానుసారం గురువారం గజ్వేల్ పట్టణంలో కొవ్వొత్తుల నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి సంస్థ కానీ మోడి వ్యవస్థను పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఎలక్షన్ కమీషన్‌తో కుమ్మక్కై నకిలీ దొంగ ఓట్లు, ఒకే ఇంటి నెంబర్‌పై అనేక ఓట్లు చేయించి ఎన్నికల కమీషన్‌ను పక్కదారి పట్టించి అధికారాన్ని చేజిక్కించుకున్నారన్నారు. నరేంద్రమోడి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఫాం-20ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో సైతం దొంగ ఓట్లతోనే అధికారం చేజిక్కించుకున్నారని, ఓటు చోరీచేసిన నరేంద్రమోడి ప్రభుత్వం బర్తరఫ్ చేసేంత వరకు నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అక్కారం యాదగిరి, డాక్టర్ వాహిద్, నియోజకవర్గ అధ్యక్షుడు అజార్, గాడిపల్లి శ్రీను, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు కొనమైన కన్నాయాదవ్, పెర్క నాగరాజు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివులు, బిసిసెల్ నాయకులు గుంటుకు శ్రీనివాస్, మన్నె అరుణ్, శ్రావణ్‌కుమార్, తంజుముల్ మజీద్ కమిటీ అధ్యక్షుడు మతీన్, కరుణాకర్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



రైతులకు సంఘీభావం తెలుపుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## రోడ్డెక్కిన అన్నదాత..మద్దతు పలికిన వంటేరు

**గజ్వేల్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** వర్షాలను లెక్కచేయకుండా రాత్రనక, పగలనక లైన్‌లో నిలబడినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరాలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గురువారం గజ్వేల్ పట్టణంలో ఇందిరాపార్కు చౌరస్తా వద్ద రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో విషయం తెలుసుకున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి వారికి మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరతను తీర్చేవరకు ఉద్యమిస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులు సమస్యలను ప్రభుత్వం తీర్చాలని, ప్రభుత్వాన్ని నిలదీసే సమయం ఆసన్నమైందన్నారు. అబద్దపు పునాదులమీద ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతుల పట్ల శాపంగా మారిందన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, గత ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను అందించారన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియాను అందించకపోతే ఈనెల 16న రైతులతో కలిసి రాజీవ్‌రహదారిని దిగ్బందం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ జెడ్‌పిటిసి పంగ మల్లేశం, మర్కంటి కనకయ్య, ఊడెం కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, దుర్గాప్రసాద్, గుంటుకు రాజు, మల్లేశం, మామిడి శ్రీధర్, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగరావు, పాల రమేష్‌గౌడ్, అహ్మద్, హనుమంతరెడ్డి, కళ్యాణ్‌కార్ శ్రీనివాస్, అశోక్, రైతులు పాల్గొన్నారు.

### ఇంజనీరింగ్ విద్యార్థికి ఆర్థిక సహాయం

**పెద్దశంకరంపేట, ఆగస్టు 14, ప్రభాతవార్త :** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్‌గిద్దకు చెందిన పేద విద్యార్థి బ్రాహ్మణపల్లి శివలింగ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో సీఈసీ సీటు వచ్చింది. దీంతో అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో పెద్దశంకరంపేటకు చెందిన విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మెన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్‌ను సంప్రదించగా అతడి చదువుకు అర్థిక సహాయాన్ని అందజేశారు. గురువారం అతడి కుటుంబ సభ్యులకు అతడి చదువు కోసం భరోసా ఇచ్చారు.





ప్లాట్ల బాధితులతో మాట్లాడుతున్న కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్

### ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా చూపిన

## పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

### ప్లాట్ల కొనుగోలుదారుల డిమాండ్

**కొండపాక, ఆగస్టు 14, ప్రభాతవార్త :** ప్రభుత్వ భూమిలో వెంచర్ చేసి పట్టా భూమిగా నమ్మించి ప్లాట్లు అమ్మిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని దర్నా చేపట్టిన ప్లాట్ల కొనుగోలుదారులు. వివరాలు ఇలా ఉన్నాయి. వెలకట్ట శివారులోని ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 271లో వేధ ఇంటర్నేషనల్ పాఠశాలలోని కొంత భూమిని యాజమాన్యం ప్లాట్లుగా చేసి విక్రహించారు. అది ప్రభుత్వ భూమి అని తెలియని కొంతమంది అమాయకులు తీర అది ప్రభుత్వ భూమి తెలడంతో లబోదిబోమంటున్నారు. విషయం తెలుసుకున్న ప్లాట్లు కొనుగోలు చేసిన భాధితులు గురువారం ఉదయం పాఠశాల ప్రారంభానికి ముందే అక్కడకు చేరుకొని పాఠశాల ప్రధాన ద్వారానిక తాళం వేసి ప్లకార్డులతో అందోళన చేపట్టారు. దీంతో పాఠశాల యాజమాన్యం కుకునూరుపల్లి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో అందోళన చేపట్టిన వారివద్దకు చేరుకొని వారితో మాట్లాడి అందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్న పాఠశాల యాజమాన్యం పాఠశాల ప్రక్కనున్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 271లో అక్రమించుకొని దాని చుట్టు కంపౌండ్ ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాల తర్వాత అక్రమించుకున్న ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా చేసి విక్రయించారని అగ్రహం వ్యక్తం చేశారు. ప్లాట్లను (భూమిని) రిజిస్ట్రేషన్ సమయంలో మండల కేంద్రమైన కొండపాక గ్రామానికి చెందిన పర్వే నంబర్ 156లో రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. భూమి కొలతలు వేసే సమయంలో వెలికట్ట శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 271 చూపించారని అవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ అయిన కొంత కాలం తర్వాత తాము మోసపోయినట్లు తెలిసిందన్నారు. ఈ విషయంలో భూమి విక్రహించడానికి మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తిని నిలదీయడంతో అయన విషయం దాట వేశాడని వాపోయారు. భూమి రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిని కలిసి వారు విషయం తెలుపగా తనకు ఏలాంటి సంబందలేదని చెప్పినట్లు వారు వివరించారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసి విక్రహించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# యుఎస్‌ఎఫ్ఐ జిలా మహాసభలను జయప్రదం చేయండి

### రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యుఎస్‌ఎఫ్ఐ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి పిలుపునిచ్చారు.గురువారం గజ్వేల్ పట్టణంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తాటికొండ రవి మాట్లాడుతూ మహాసభలలో విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన చేయబోతున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలోని విద్యార్థినీ, విద్యార్థులు, మేధావులు హాజరవుతున్నట్లు తెలిపారు. దేశంలో అందరికీ సమానమైన విద్యావకాశాలు కల్పించాలని, విద్యారంగ అభివృద్ధికై యుఎస్‌ఎఫ్ఐ కృషి చేస్తుందన్నారు. విద్యా రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని, చట్ట ప్రకారం విద్యకు కేటాయించాల్సిన బడ్జెట్‌ను కేటాయించకుండా నీరుగారుస్తున్నాయని ఆరోపించారు. మరోవైపు విద్య కార్పోరేటీకరణ, ప్రైవేటీకరణ వైపు మార్పులు వస్తున్నా పాలకులు వాటిని ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రోత్సహించడంలేదన్నారు. గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించే జిల్లా మహాసభలకు విద్యావంతులు, మేధావులు, విద్యావేత్తలు, విద్యా సంస్థల యజమానులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుడికందుల రవి, నాయకులు శేఖర్, హేమంత్, రాజు, బాబు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న తాటికొండ రవి

### సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్సీ

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్ పూజిత ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా పెద్దమొత్తంలో ఖర్చుకావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. వారికి ముఖ్యమంత్రి సహాయనిధినుండి మంజూరైన రూ.20,500 చెక్కును గురువారం పూజిత కుటుంబసభ్యులకు ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని, ఈ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి పంగ మల్లేశం, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు గంగిశెట్టి రవి, కళ్యాణ్‌కార్ నర్సింగరావు, జాలిగామ అశోక్ పాల్గొన్నారు.

### కళాశాలకు ట్రాలీ స్పీకర్‌ను బహూకరించిన ఉద్యోగులు

**రామచంద్రాపురం, ఆగస్టు 14, ప్రభాతవార్త:** బిహెచ్ఈఎల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బిహెచ్ఈఎల్ ఉద్యోగులు యశోస్వాతి, జిపి రామరాజ్ గురువారం ప్రిన్సిపాల్ జి.రవీందర్‌కు ట్రాలీస్పీకర్‌ను బహుకరించారు. విద్యార్థులకు, సమావేశాల ఏర్పాటు సమయంతో, ప్రార్థన చేసే తరుణంలో ట్రాలీ స్పీకర్ ఉపయోగకంగా ఉంటుందన్న ఉద్దేశంతో స్పీకర్‌ను అందచేశామన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కళాశాలకు స్పీకర్‌ను అందచేసిన దాతలకు ప్రిన్సిపాల్ జి రవీందర్, అధ్యాపకులు ధన్యవాదాలు తెలిపారు.

### ఆరుట్ల చెరువును సందర్శించిన ఎంపిడివో బాలశంకర్

**మంచాల,ఆగస్టు 14 ప్రభాతవార్త:** అతి భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు భాగంగా సందర్శించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మంచాల మండలం ఆరుట్లలోని నరికెళ్ల చెరువుని ఎంపీడీవో బాలశంకర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డి ఈ స్నేహలత, ఏఈ మోనిక, ఆరుట్ల సెక్రెటరీ వెంకటేష్ లు పాల్గొన్నారు.

### గ్రామస్తుల సహకారంతో వీధి దీపాల ఏర్పాటు

#### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరుణాకర్ రెడ్డి

**కేశంపేట ఆగస్టు 14 ప్రభాతవార్త**

కేశంపేట మండల పరిధిలోని తొమ్మి ది రేకుల గ్రామంలో ప్రత్యేక అధికారులు పాలనలో నిధుల కొరతతో గత ఆరు మాసంల నుండి గ్రామం లో వీధి దీపాలు లేక ప్రజలు మేక రకాల ఇబ్బంది పడుతున్న విషయా న్ని గమనించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బీస కరుణాకర్ రెడ్డి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల సహకారంతో చందా పోగుచేసి 20 వేలరూపాయలతో గ్రామం మొత్తం వీధిదీపాలు ఏర్పాటు చేయించారు. గ్రామంలో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకుని గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కరుణాకర్ రెడ్డిని మరియు కాంగ్రెస్ నాయకులను గ్రామస్తులు అభినందించారు .ఈ కార్యక్రమంలో గుత్తి చంద్రయ్య ,గుత్తి శేఖర్ ,ఆలూరు శ్రీనివాస్ రెడ్డి, కల్వకోల్ నిరంజన్, ఖాజ హలి, చిట్టి రెడ్డి రాం రెడ్డి, గోసిక కృష్ణయ్య,బత్తుల యాదయ్య తో పాటు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఐడికార్డులు, టై, బెల్టుల పంపిణీ

**కేశంపేట ఆగస్టు 14 ప్రభాతవార**

మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన మామిడిపల్లి భాస్కర్ ముదిరాజ్, కానుగుల రవి ముదిరాజ్ ల సహకారంతో గురువారం దత్తయ్యపల్లి గ్రామంలో ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఐడి కార్డులు, బెల్టులు, టై, షూస్‌లను అందించడం ఎంతో అభినందనీయమన్నారు మండల విద్యాధికారి చంద్రశేఖర్, ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు చేయూతనందిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆయన అన్నారు, ఇలాంటి ప్రోత్సాహకాలు అందించడంవల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని విద్యార్థులకు ప్రోత్సకాలను అందించేందుకు యువత ముందుకు రావాలని ఆయన అన్నారు. గొప్ప మనసుతో విద్యార్థులకు చేయూత నందించిన కానుగుల రవి ముదిరాజ్ భాస్కర్ ముదిరాజులను మండల విద్యాధికారి చంద్రశేఖర్ శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు శివ, శ్రీశైలం, వేణు, గ్రామపంచాయతీ కార్యదర్శి, జ్యోతి విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

### కుదురుమల్ల కొత్తచెరువు, వాగులను పరిశీలించిన ఎస్సై

**దుద్యాల్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కుదురుమల్ల, సంగాయిపల్లి కొత్తచెరువు మత్తడి పారింది. ఈ క్రమంలో దుద్యాల ఎస్సై యాదగిరి, గ్రామ పోలీస్ అధికారి శ్రీశైలంతో కలిసి కొత్తచెరువును పరిశీలించారు. వాగులో చేపలు పడుతున్న వారిని లోతట్టు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు పంపించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలకు పలు సూచనలు చేశారు.

## వర్షాలకు అందరూ అప్రమత్తం కావాలి

### కల్వర్టుల వద్ద ప్రమాద హెచ్చరికలు జారీచేసిన సిఐ ప్రసాద్

**నందిగామ ఆగస్టు 14 ప్రభాతవార్త**

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు,చెరువులు పొంగి ప్రవహిస్తుండడంతో నందిగామ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ , రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ లు ప్రజలను అప్రమ త్తం చేశారు, నందిగామ శివారులో ఉన్న అప్పరెడ్డి గూడవాగు, లింగమూర్తిల వాగు, అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ వెళ్లేదారిలో మధ్యలో ఉన్న వాగు పొర్లడంతో ప్రమాద హెచ్చరికలు జారీచేస్తూ కల్వర్టుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులవద్ద రాకపోకలు నిలిచిపోయాయి. వాగు దాటకుండ ముళ్ళ కంచవేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

### విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ

**తలకొండపల్లి ఆగస్టు 14 ,ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని విద్యార్థులకు విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ డ్రస్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసే యూని ఫామ్ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వివో అధ్యక్షులు రమాదేవి ప్రేమలత పేటియం రామస్వామి సిసి సత్యనారాయణ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**తలకొండపల్లి ఆగస్టు 14 ,ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని పోతుగంటి మహేష్ గురువారం మృతి చెందాడు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలుసుకొని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతు గంటి మహేష్ చిన్న వయసులో మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, నాయకులు డేవిడ్ వేణు రెడ్డి యాదయ్య ఆవంచ నరసింహారెడ్డి తదితరులున్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**చిన్నశంకరంపేట, ఆగస్టు 14,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం మడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మెదక్‌లో గురువారం జాతీయ స్థాయిలో నిర్వహించిన అండర్-19 వాలీబాల్ ఆటలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. 9వ తరగతి చదువుతున్న అక్షిత, హేమజ, 10వ తరగతి చదువుతున్న నికిత, రేవేష్, సుమంత్‌లు ఈ నెల 18,19తేదిలలో భాగ్యనగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయిలో గెలిచిన విద్యార్థులు చైనా దేశంలో నిర్వహించే అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.



నికిత రేవేష్ అక్షిత హేమజ సుమంత్

## సిర్గాపూర్‌లో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



సిర్గాపూర్‌లో హర్‌ఘర్ తిరంగార్యాలీ నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

**సిర్గాపూర్, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ సూచనల మేరకు బిజెపి ఆధ్వర్యంలో గురువారం హర్‌ఘర్ తిరంగార్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు శంకర్‌పాటిల్, మండల యువమోర్చా అధ్యక్షులు యాదగిరిముదిరాజ్, నాయకులు వినోద్ పాటిల్ తదితరులు పాల్గొని భారతదేశానికి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## ఆచార్య కళాశాలలో వంటకాల పోటీలు



ఆచార్య డిగ్రీ కళాశాలలో వంటకాల పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వంటకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ శాంత ముఖ్య అతిథిగా హాజరై వంటరుచులను ఆస్వాదించారు. ఈసందర్భంగా శాంత మాట్లాడుతూ మారుతున్న వాతావరణపరిస్థితులకు అనుగుణంగా చిరు ధాన్యాల ప్రాముఖ్యతను సమాజానికి తెలియపర్చాల్సిన అవసరం ఉందన్నారు. చిరుధాన్యాలతో పలురకాల స్వీట్లు, జొన్న, సజ్జ రొట్టెలను విద్యార్థులు కార్యక్రమంలో ప్రదర్శించారు. కళాశాలలో విద్యను అందుకుంటున్న 106మంది విద్యార్థులు తయారుచేసిన వంటకాలను అతిథులు స్వీకరించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ హరి కుమార్ మాట్లాడుతూ ప్రతిసంవత్సరం ఆగస్టు 14న వంటకాల పోటీలు, వ్యాసరచన, దేశభక్తిగీతాల, పాటలపోటీలు కళాశాలలో ఏర్పాటు చేస్తున్నామని గుర్తు చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనశక్తిని వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల న్యాయనిర్ణేతలుగా సల్మా, నవీన, లావణ్య, శ్రావణి, రాంప్రసాద్, జగదేవిలు వ్యవహించారు. పోటీల్లో ప్రతిభచాటిన వారికి స్వాతంత్ర్యం పర్వదినాన బహుమతులు అందచేస్తామని కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన జెడిఎ



బేగంపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీచేస్తున్న జెడిఎ

**కంది, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని బేగంపేటలోని ఎరువులదుకాణాన్ని జిల్లా వ్యవసాయ అధికారి గురువారం తనిఖీచేశారు. యూరియా నిల్వలు, అమ్మకాలు, స్టాక్ బోర్డులను పరిశీలించారు. డీలర్లు విధిగా ఎరువులు ఈపిఓఎస్ ద్వారా ఆధార్‌కార్డు నంబరును ఎంట్రీచేసి అమ్మకాలుజరపాలని డీలర్లకు సూచించారు. రైతులకు విధిగా బిల్లులు అందచేయాలన్నారు. రశీదులు లేకుండా అమ్మితే ఎఫ్‌సిఓ 1985ప్రకారం చర్యలుతప్పవని హెచ్చరించారు. అక్రమంగా ఎరువులను నిల్వచేస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలో 60 మెట్రిక్‌టన్నుల యూరియా, 45టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళనచెందాల్సిన అవసరం లేదన్నారు. ఎరువులను అధికమోతాదులో వాడవద్దని రైతులకు సూచించారు. జెడిఎ వెంట మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు. పాల్గొన్నారు.

## వాగును పరిశీలించిన సిఐ వెంకట్‌రెడ్డి



వాగు పరిసరాలను పరిశీలిస్తున్న సిఐ వెంకట్‌రెడ్డి

**సిర్గాపూర్, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వంగదళ్ గ్రామశివారులోని వాగును, వాగు పరిసరాలను సిఐ వెంకట్‌రెడ్డి ఎస్ఐ మహేష్‌తో కలిసి పరిశీలించారు. గైరాన్ తండాకు చేరుకుని తండావాసులకు పలుసూచనలు చేశారు. భారీగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యసరమైతే కాని గ్రామంవదిలి వెళ్లవద్దని, విద్యుత్‌స్తంభాలవద్ద, చెట్లకింద ఉండకూదని ప్రజలకు సూచించారు. వాగులు ఉప్పొంగుతున్నాయని, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు.

## వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**–తహసీల్దార్ మల్లయ్య**

**అల్లాదుర్గం, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
రానున్న మూడు రోజులు భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరించినందుకు మండలప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మల్లయ్య మండల ప్రజలకు సూచించారు. అధికారులు జాగరూకతతో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. అత్యవసరం అయితేనే ప్రజలు ఇంటి గడప, గ్రామం దాటాలన్నారు. అత్యవసరం అయితే స్థానిక నాయకులతో పాటు పోలీసులకు సమాచారం అందించాలని తహసీల్దార్ మల్లయ్య మండల ప్రజలకు సూచించారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
అనారోగ్యానికి గురైన మండలానికి చెందిన 7మందికి మెరుగైన చికిత్స అందుకునేందుకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో1లక్ష 90000రూపాయల చెక్కులను అందచేశారు. కాశింపూర్‌కుచెందిన అంజమ్మకు 23,500, గోపాల్‌కు 48వేలు, బూచినెల్లికి చెందిన జయదమ్మకు 13,000, మొల్లగారి రూబెన్‌కు 28,500, గోవింద్‌పూర్‌కుచెందిన రాథోడ్ శీలాబాయికి 28000, చిరాగ్‌పల్లికి చెందిన ఇస్మాయిల్‌కు 29000 సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఆత్మకమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఝరాసంగ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు వెంకటేశం, పాక్స్‌చైర్మన్ మచ్చేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజీం, మాజీ కేతకి ఆలయకమిటీ చైర్మన్ నర్సింహాగౌడ్, మాజీ పట్టణ అధ్యక్షులు మొహియుద్దీన్, బిసిసెల్ అధ్యక్షులు అమిత్‌కుమార్, మాజీ సర్పంచ్ చిన్నరెడ్డి, శ్రీనివాస్, శివముదిరాజ్, రాథోడ్ భీమ్‌రావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 14వ బ్లాక్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలోని 14వబ్లాక్‌లో 8.50లక్షల రూపాయలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణం పనులకు గురువారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్‌కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్ప నగేష్ మాట్లాడుతూ గతంలో ఎప్పుడో వేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నట్లు మార్నింగ్ వాక్ విత్ అఫీషియల్స్ కార్యక్రమంలో కాలనీ వాసులు సమస్యను తమ దృష్టికి తెచ్చారని, ప్రజలు పడుతున్న పాట్లను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నాయకులు సిఎం మల్లేష్, చాకలి నరసింహ, సత్తయ్య, బసప్ప, జలమండలి సిబ్బంది నాయక్, ప్రవీణ్ యాదగిరి, శ్రీకాంత్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## భారీవర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

**–పాడుబడిన ఇళ్ళలో ఉండరాదు: మున్సిపల్ కమిషనర్ దశరథ్**

**గుమ్మడిదల, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీపరిధిలోని అన్నిగ్రామాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ విపత్తును ఎదుర్కోవాలని గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్ దశరథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరవధికంగా పడుతున్న వర్షానికి పాడుబడ్డ ఇళ్లల్లో ఉండరాదని అలాగే చెరువులు కుంటలు నాలాలు నిండి, పొంగిపొర్లే అవకాశం ఉన్నందున గ్రామాల్లోని అధికారులు మున్సిపాలిటీసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ చెరువులను కుంట లను 24గంటలు పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తంచేస్తూ కావలసిన జాగ్రత లు తీసుకోవాలని అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకుండా ఇళ్లలోనే ఉంటూ ఎప్పటికప్పుడు గ్రామ, మండల అధికారులతో అనుసంధానం ఏర్పరచుకొని సమాచారం చేరవేయాలని కోరారు. అలాగే ప్రజలు వేడినీరు వేడి ఆహారం తీసుకొని పలు సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా దూరంగా ఉండాలని సూచించారు. సాధ్యమైనంత వరకు శుభ్రత పాటించి ఇళ్లల్లోనే ఉంటూ తగు జాగ్రతలు తీసుకోవాలని తెలిపారు. మలేరియా, డెంగు, టైఫాయిడ్, కలరా, వంటి వ్యాధులు వ్యాపించకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. ఏమాత్రం అనుమానం ఉన్నా ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారి పర్యవేక్షణలో తగుమందులు వాడుతూ జాగ్రత వహించాలని మున్సిపాలిటీ పరిధిలోని అన్నివార్డులలోని ప్రజలకు తెలియజేశారు. అత్యవసర సమయంలో 24గంటలు అందుబాటులో ఉండే గ్రామ మండల అధికారులను సంప్రతించాలని కోరారు.

## మెదక్ పట్టణంలో భారీ తిరంగాయాత్ర

**–హాజరైన వివిధ కళాశాలల విద్యార్థులు, బిజెపి నాయకులు**



మెదక్ పట్టణంలో తీరంగార్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**మెదక్ టౌన్, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
మెదక్ పట్టణంలో హర్‌ఘర్ తీరంగాయాత్రలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయజెండా అనే నినాదంతో మెదక్‌పట్టణంలో గురువారం వివిధ కళాశాలల విద్యార్థులు, బిజెపినాయకులు కలిసి భారీర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు 300మీటర్ల భారీ జాతీయపతాకంతో పట్టణంలోని న్యూ హైస్కూల్ నుంచి పాత బస్టాండ్, రాందాస్ చౌరస్తా మీదుగా బస్ డిపో వరకు ప్రధానరహదారిపై భారీర్యాలీ నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిపై ఆపరేషన్ సింధూర్ విజయం సాధించిన సందర్భంగా తిరంగార్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దేశంపైభక్తితో తమ ఇంటిపై రేపు జాతీయజెండాను ఎగురవేయాలన్నారు. అనంతరం సామూహిక జనగణమన పాడారు. ఈకార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, ఎంఎల్ఎన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్, మండల అధ్యక్షురాలు బెండ వీణ, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, నాయకులు నల్లాల విజయ్, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల ఎర్రచెరువు కట్టలో పగుళ్లు

**–భద్రతాచర్యల్లో అధికారులు**



జిఎండిఎల్ 01 ఎర్రచెరువు కట్టను అధికారులు పరిశీలిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
వర్షాకాలంలో చెరువుకట్ట భద్రతను కాపాడేందుకు గుమ్మడిదల ఎర్ర చెరువులో కనిపించిన పగుళ్లను కమిషనర్ దశరథ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. పరిశీలనలో కట్టలో బలహీనమైన భాగాలను గుర్తించిన కమిషనర్, వర్షపునీటి ఒత్తిడి వల్ల నష్టం జరగకుండా తక్షణ మరమ్మతులు చేపట్టాలని సంబంధిత మున్సిపల్ విభాగాలకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే, ఈపరిస్థితిపై నివేదికను ఇరిగేషన్ అధికారులకు పంపుతానని తెలిపారు. కట్ట నిర్మాణం దృఢంగా ఉండేలా తగిన ఇంజనీరింగ్‌చర్యలు చేపట్టాలని సూచించారు. ఈపరిశీలనలో మాజీసర్పంచ్ తులసీదాస్‌సాగర్, ఆలయకమిటీ చైర్మన్ ముద్దుల బాల్రెడ్డి, మాజీ వార్డుసభ్యులు జైపాల్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు ప్రభాకర్, నారాయణలు పాల్గొన్నారు. పౌరులు చెరువుకట్ట సమీపానికి వెళ్లకుండా జాగ్రతలు పాటించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

## డంపింగ్ యార్డు హటావో జంగల్ బచావో

**–191వ రోజుకు చేరుకున్న రిలే నిరాహారదీక్షలు**




రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న గ్రామస్థులు, మహిళలు

**గుమ్మడిదల, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
ప్యారానగర్ డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యు)కు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించకపోవడం అన్యాయమని నల్లవల్లి రైతు జెఎసి నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ గ్రామశివారులో ఏర్పాటుకాబోతున్న డంపింగ్‌యార్డును ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 191వరోజుకు చేరుకున్నాయి. గతప్రభుత్వం ఇచ్చిన అనుమతులను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. తమకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామనిహెచ్చరించారు. కార్యక్రమంలో రైతు జెఎసినాయకులు, మహిళాసభ్యులు ప్యారానగర్, నల్లవల్లి, కొత్తపల్లి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ

**–డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

**నాగల్‌గిద్ద, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కరస్‌గుత్తిలో గురువారం పార్టీ కార్యకర్తలతో చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బురదచల్లే యత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు తగురీతిలో ఓట్లతో బుద్ధిచెప్పినా ఇంకా మారకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సొసైటీచైర్మన్ శ్రీకాంత్, వైస్‌చైర్మన్ అంజిరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు పండరినాథ్, మాజీసర్పంచ్‌లు అనిల్‌పాటిల్, సంజీవ్‌పాటిల్, విఠల్‌రావు, ప్రభాకర్‌రెడ్డి నాయకులు బస్వరాజ్, అనిల్ పాటిల్, నెహ్రూనాయక్, నారాయణజాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 18వ తేదీన ఆర్మూర్‌లో గురుకులాల స్పాట్ అడ్మిషన్లు

**–ఎస్టీ గురుకులాల రీజినల్ కో–ఆర్డినేటర్ గంగారామ్‌నాయక్**

**కౌడిపల్లి, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలసంస్థ పరిధిలోని మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలలోగల గురుకులాల్లో పరిమితిసంఖ్యలో ఉన్న 5 నుండి 9 వ తరగతుల ఖాళీల భర్తీ కోసం ఈ నెల 18వ తేదీన పెర్కిట్ లోగల చీమన్‌పల్లి గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ గంగారామ్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యార్థులు మాత్రమే ఈకౌన్సిలింగ్‌కు అర్హులని ఆయన అన్నారు. ఎంట్రెన్స్ టెస్టు మార్కులు, నియోజకవర్గ స్థానికత, డేట్ ఆఫ్ బర్త్ ఆధారాంగా పూర్తి పారదర్శక పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే కౌన్సిలింగ్ ఉంటుందని, ఆలస్యంగా వచ్చినవారు కౌన్సిలింగ్‌కు అనర్హులు అని ఆయన తెలిపారు. అనాథ గిరిజన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని ఆయన అన్నారు. బోనఫైడ్ అధారంగా డేట్ ఆఫ్ బర్త్, స్థానికత తీసుకుంటామన్నారు. ఒరిజినల్ సర్టిఫికేట్స్ తప్పకుండా తీసుకొని రావాలని ఆయన కోరారు.

# హామీలు ఇంకెప్పుడు అమలుచేస్తారు?

**–ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నాగల్‌గిద్ద, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ చేసిన హామీలను అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇంకెప్పుడు అమలుచేస్తారని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం మండల పరిధిలోని కరస్‌గుత్తిలో బిఆర్ఎస్ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈసందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని పలు తండాలకు బిటి రోడ్డుల నిర్మాణం పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. చేసిన హామీలను అమలు చేసే వరకు బిఆర్ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓట్ల రూపంలో కాంగ్రెస్‌కు తగురీతిలో గుణపాఠం చెప్పాలని బిఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు పలకాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మేత్రి పండరి, మాజీ జడ్పీటిసి సభ్యులు నర్సింహారెడ్డి, నాయకులు ముజమ్మిల్, అంజిరెడ్డి, శ్రీధర్‌పాటిల్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

## జీవవైవిధ్యానికి అటవీమొక్కల పెంపకం

**–గుంగులూరు రైతులతో అధికారుల ఒప్పందం**



రైతులతో ఒప్పందంకుదుర్చుకుంటున్న అటవీజీవవైవిద్యసంస్థ బాధ్యులు

**పుల్‌కల్, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
జీవ వైవిధ్యాన్ని పెంపొందించుటకు హైద్రాబాద్‌లోని అటవీ జీవవైవిధ్య సంస్థ మండలపరిధిలోని గుంగులూరు రైతులతో గురువారం ఒప్పందం కుదుర్చుకున్నది. అటవీమొక్కలను ఉపయోగించి గుండ్లూరు గ్రామంలో అభివృద్ధి చేయడానికి పైలెట్ ప్రాజెక్టుగా గ్రామంలోని కొందరు రైతులను ఎంపికచేసుకుని వారి వ్యవసాయభూముల్లో మొక్కలునాటే కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, విస్తరణ విభాగం అధిపతి డాక్టర్ పంకత్‌సింగ్, డాక్టర శ్రీకాంత్, డిప్యూటీ రేంజ్ అధికారి వేణుగోపాల్ ఏపిఓ సంతోష్, టెక్నికల్ అసిస్టెంట్ త్రిలోక్ ప్రతాపరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముంజరేకర్, రైతులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనల్లపోచమ్మ ఆలయ ఆదాయం రూ.7.43లక్షలు



ఆలయ హుండీ లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది దృశ్యం

**కౌడిపల్లి, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
జిల్లాలలోనే రెండవ అతిపెద్ద జాతరగా పేరుగాంచిన తునికి గ్రామ శివారులో వెలసిన శ్రీనల్లపోచమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ. 7.43 లక్షలు వచ్చినట్లు ఆలయ ఇంచార్జి ఈవో రంగారావు తెలిపారు. గురువారం ఉదయం శ్రీనల్లపోచమ్మ అమ్మవారి ఇంచార్జి ఈవో రంగారావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేసి, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించిన పిదప కూచన్‌పల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేయగా ఆయన సమక్షంలో ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గడిచిన నాల్గు నెలల 19 రోజులకుగాను శ్రీనల్లపోచమ్మ ఆలయహుండీ ఆదాయం రూ. 7,43,345 రూపాయలు వచ్చినాయి. ఈ సందర్భంగా ఇంచార్జి ఈవో రంగరావు మాట్లాడుతు హుండీ ద్వారా వచ్చిన ఆదాయం అమ్మవారి బ్యాంక్‌ఖాతాలో జమచేసి ఆలయంవద్ద పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించబడుతుందని ఆయన తెలిపారు. ఎంతో మహిమాన్వితమైన శ్రీనల్లపోచమ్మతల్లి ఆలయాన్ని రోజురోజు భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తున్నందున ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులైన మరుగుదొడ్లు, స్త్రీలకు ప్రత్యేకమైన స్నానపుగదులు, త్రాగునీటి కుళ్లాయిల నిర్మాణంకుగాను దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించి తమ వంతు కృషి చేయాలని ఈవో కొరారు. ఈకార్యక్రమంలో ఈయనతోపాటు ఆలయ జూనియర్‌అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి సిబ్బంది రామక్రిష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు శివప్ప, రాజేశ్, గ్రామపెద్దలు సాయాగౌడు, శేఖర్, శంకర్, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**–ప్రజలతో సిఐ రేణుకరెడ్డి**



రోడ్డుప్రమాదాల నివారణకు ప్రజలకు అవగాహనకల్పిస్తున్న సిఐ రేణుకరెడ్డి

**అల్లాదుర్గం, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రయాణికులతో పాటు వాహన చోదకులు రోడ్డు నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందని సిఐ రేణుకరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చిల్వర్‌గ్రామం శివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న రోడ్డుప్రమాద స్థలాన్ని జాతీయ రహదారి అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, ఆర్టీసి డిపో మేనేజర్‌లతో కలిసి పర్యవేక్షించారు. వాహన చోదకులు మూల మలుపుల వద్ద, స్పీడ్ బ్రేకర్‌ల వద్ద జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలను తోలాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారాలు ఉండవన్నారు. చిల్వర్ గ్రామ సమీపంలోని 161 జాతీయ రహదారిపై తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అందుకు ప్రజలు తగు జాగ్రతలు పాటిస్తూ ప్రయాణం చేయాలన్నారు. బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతిచెందారని, ప్రమాదానికి గురైన బాధితుల కుటుంబ సభ్యులు ఆర్టీసి బస్సును ధ్వంసం చేయడంతో పాటు డ్రైవర్, కండక్టర్‌లపై దాడి చేశారని, 161 జాతీయ రహదారిపై భైఠాయించి 2 గంటల పాటు ధర్నాచేయడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు పాట్లు పడాల్సి వచ్చిందని, అందుకు సంబంధించిన 15మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఆర్టీసి డ్రైవర్లు బస్సులను తోలే సమయంలో జాగ్రతగా పాటించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఆర్టీసి డిపో మేనేజర్ ఉపేందర్, అల్లాదుర్గం ఎస్ఐ శంకర్, 161 జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా జైలును తనిఖీచేసిన న్యాయమూర్తి



కందిలోని సెంట్రల్ జైలును తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి సౌజన్య

**కంది, ఆగస్టు 14, ప్రభాతవార్త:**
జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు గురువారం కందిలోని సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులోని బేరక్‌లను, గదులు, వంటగదిని, మరుగుదొడ్లను, జైలు పరిసరాలను పరిశీలించారు. ఖైదీలకు జైలులో అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. ఖైదీలకు ఇబ్బందులు కల్గకుండా తగు చర్యలు తీసుకోవాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఖైదీలు తమ కేసులను పరిష్కరించుకునేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఖైదీలకు అందచేస్తున్న భోజనం రుచిని న్యాయమూర్తి ఆస్వాదించారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది తదితరులు ఉన్నారు.